క్లుప్తంగా

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



అరబుపాలెంలో వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చిన మట్టి వినాయక విగ్రహాలను బుధవారం ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల జోలికి పోకుండా మట్టి ప్రతిమలను పూజించాలన్నారు. ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, సంస్థ ప్రతినిధులు రాము, ప్రసాదరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

మునగపాక: మండల స్థాయి క్రీడా పోటీలను ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్‌ఐ మండల కో–ఆర్డినేటర్ పి.రవి శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–17లలో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయన్నారు. మండలంలోని డేవెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర పోటీలు జరుగుతాయన్నారు. తిమ్మరాజుపేట జిల్లాపరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం జి.అప్పారావు,వ్యాయామ ఉపాధ్యాయులు కె.నాగమణిల నేతృత్వంలో జరిగే క్రీడా పోటీలను విజయవంతం చేయాలని రవి శంకర్ కోరారు.

శాశ్వత భూ హక్కు పాసు పుస్తకాల పంపిణీ



పాసు పుస్తకం అందజేస్తున్న వీఆర్వో జగన్నాథరావు

రాంబిల్లి: కట్టుబోలులో బుధవారం పలువురు రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పాసు పుస్తకాలను వీఆర్వో జగన్నాథరావు అందజేశారు. మండలంలో కట్టుబోలు సచివాలయ పరిధిలో గల గ్రామాల్లో గతంలో సమగ్ర భూ సర్వే చేశారు. ఈ సర్వే ఆధారంగా కొత్త పాసు పుస్తకాలు రావడంతో వాటిని రైతులకు అందజేస్తున్నామని వీఆర్వో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తాతాజీ, వీఆర్‌ఏ ప్రసాద్ పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి

అనకాపల్లిటౌన్: మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు నైపుణ్య శిక్షన కార్యక్రమాలు దోహదపడతాయని హోమియో వైద్యనిపుణులు డాక్టర్ బి.శశిధర్ అన్నారు. స్థానిక గాంధీనగరం శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ మొదటి, రెండవ బ్యాచ్‌ల శిక్షణ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థల కార్యక్రమంలో పాల్గొనడం సంతోషాన్ని, ప్రశాంతతని కలిగిస్తుందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో మహిళలకు వివిధ వృత్తుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన మహిళలు వారిళ్ల వద్దే ఖాళీ సమయాన్ని సద్వినియోగపరచుకుని, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణరాజు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జిలు అన్నం రాజశేఖర్, ఎస్.ఎస్.లక్ష్మణరావు, కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కె.జె.పురంలో గౌరీపూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం రామాలయం వద్ద గురువారం లలితాపారాయణం, గౌరీ పూజలు నిర్వహించనున్నట్టు స్థానిక వెంకట జగన్నాథ కోలాటం, శ్రీలక్ష్మి గణపతి కోలాటం గ్రూపు సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 17న శ్రావణ మాసం ప్రారంభం నుంచి లలితాపారాయణం నిరంతరాయంగా చేస్తున్నామన్నారు. చివరి రోజు గౌరీపూజలో మహిళలు పూజ సామగ్రితో పాల్గొనాలని కోరారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



దార్లపూడిలో బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని, ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరిస్తూ, బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. దార్లపూడి గ్రామంలో బుధవారం 3వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం గ్రామస్తులను పేరుపేరునా పలకరిస్తూ పథకాలు అందాయో లేదో ఆరా తీశారు. కుటుంబాల వారీగా అందిన సంక్షేమ లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. తమకు అన్ని పథకాలు మంజూరవుతున్నాయని స్థానికులు తెలిపారు. స్థానికుల సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. మెయిన్ రోడ్డు సమస్యను త్వరలో పరిష్కారిస్తానని తెలిపారు. జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, సతీష్, మాజీ జెడ్పీటీసీ కోింకోట నీలేంద్రరావు, శ్రీను, మల్లేష్, రామారావు, బాబూరావు, సచివాలయ సిబ్బంది,గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



సిరసపల్లిలో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి



కొత్తగా పింఛను పొందిన లబ్ధిదారులతో నాయకులు



కొత్తగా మంజూరైన పింఛన్ అందజేస్తున్న చిక్కాల రామారావు



పద్మనాభరాజు పేటలో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

పాయకరావుపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చిక్కాల రామారావు అన్నారు. పార్టీలకు అతీతంగా రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. కొత్తగా ప్రభుత్వం మంజూరు చేసిన సామాజిక పింఛన్లను మండలంలోని మాసాహేబుపేటలో బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొంతం నరేష్, సచివాలయ కన్వీనర్లు గంటా నాగేశ్వరరావు, కంకిపాటి దొరబాబు పాల్గొన్నారు.

మునగపాక: అర్హులైన అందరికీ పింఛన్‌లు అందజేస్తామని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి తెలిపారు. మండలానికి కొత్తగా మంజూరైన పింఛన్లను ఆమె స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఉప సర్పంచ్ సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు టెక్కలి కొండలరావు, బొడ్డేడ అప్పలనాయుడు, బొడ్డేడ మహేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహన రావు, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు పాల్గొన్నారు. సిరసపల్లిలో సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి పింఛన్‌లు పంపిణీ చేశారు.

నక్కపల్లి: కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను బుధవారం మండలంలోని నక్కపల్లి, దేవవరం, వేంపాడు,గునిపూడి తదితర గ్రామాల్లో పంపిణీ చేశారు. వేంపాడులో పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి అయినంపూడి మణిరాజు, సర్పంచ్ ఏడిద నూకరత్నం పింఛన్ల నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని చెప్పారు. జనవరి, ఆగస్టు నెలల్లో కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: మండలంలో పేట, బయ్యవరం, ములకలాపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను బయ్యవరం సర్పంచ్ మొగలిపల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు గొన్నాబత్తుల శివ బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దుబాసి అప్పలనాయుడు, ఊటకూటి శేఖర్,అడపా అప్పలనాయుడు,మొగలిపల్లి గణేష్,సచివాలయ సిబ్బంది రాజా, రవి, శ్రీను,రాజు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని నునపర్తి,ఖాజీపాలెం గ్రామాల్లో బుధవారం నూతన పింఛన్లు పంపిణీ చేశారు. నునపర్తిలో సర్పంచ్ చుక్కా అనురాధ, ఖాజీపాలెంలో సర్పంచ్ పీలా నర్సింగరావు పింఛన్లు పంపిణీ చేశారు.

రాంబిల్లి : పారదర్శకంగా అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని దిమిలి సర్పంచ్ బంగారు చిలుకు అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లను ఇక్కడి సచివాలయంలో బుధవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ, మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొట్టాపు వడ్డికాసులు, కరణం శ్రీహరి, వెల్ఫేర్ అసిస్టెంట్ రేవతి, డిజిటల్ అసిస్టెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పంచదార్లలో కొత్తగా మంజూరైన పింఛన్లను సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగాసీఎం జగన్ చిత్ర పటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రవి, వైస్సార్‌సీపీ నాయకులు చందక రాజు, అప్పికొండ రమేష్, సుందరపు బాబు, సచివాలయ కన్వీనర్లు సత్య, చిరంజీవి పాల్గొన్నారు.



పంచదార్లలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు



దిమిలిలో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్



నునపర్తిలో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ అనురాధ

దేవవరంలో పారిశుధ్య పనులు



పారిశుధ్యపనులు నిర్వహిస్తున్న కార్మికులు

నక్కపల్లి: మండలంలోని దేవవరం పంచాయతీలో బుధవారం పారిశుధ్యపనులు నిర్వహించారు.ఇటీవల వర్షాలు పడడం వల్ల దేవవరంతో పాటు, శివారు ఒడ్డిమెట్ట, చినరామభద్రపురం గ్రామాల్లో మురికి కాలువల్లో చెత్త, మురికి ఎక్కడికక్కడ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రత్యేకంగా పారిశుధ్య కార్మికులను రప్పించి సర్పంచ్ గొర్ల నర్సింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, ఉప సర్పంచ్ వేగేశ్న చంటిల పర్యవేక్షణలో పనులు చేపట్టారు. జెడ్పీ ఉన్నత పాఠశాలకు, నూకాలమ్మ అలయానికి వెళ్లే ప్రధానరోడ్డు మధ్యలో కల్వర్టు పూర్తిగా శిథిలమైంది. దానిని తొలగించి కొత్త కల్వర్టు నిర్మించే పనులు ప్రారంభించారు.

ఈ- పంట ఆవశ్యకతపై విస్తృత ప్రచారం

రావికమతం: ఈ–పంట ఆవశ్యకతను రైతులకు తెలియజేయాలని వ్యవసాయ సిబ్బందికి వ్యవసాయ శాఖ డివిజనల్ ఏడీఏ శ్రీదేవి సూచించారు. స్థానిక ఆర్బీకే కార్యాలయంలో మండల, సచివాలయ వ్యవసాయ సిబ్బందితో బుధవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతుకు ఖరీఫ్ ఈ – పంట ప్రాముఖ్యత తెలియజేయాలన్నారు. ఈ–పంటకు సంబంధించి ఈకేవైసీ ఈ నెల 22వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. పీఎం కిసాన్ స్కీంలో అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 15వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రావికమతం, రోలుగుంట మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు.. జోరుగా వరినాట్లు



ట్రాక్టర్‌తో దమ్ము పడుతున్న దృశ్యం



వరి నారు తీస్తున్న రైతులు

- మండలంలో 7,300 ఎకరాల్లో వరి సాగు
- తాజా వర్షాలతో తొలగిన రైతుల బెంగ
- ఒకేసారి ఉడుపులతో కూలీల కొరత

ఈ ఏడాది వర్షాలు ఆలస్యమయ్యాయి. దీంతో నారు ఎండిపోతుందేమోనన్న బెంగలో రైతులు కొట్టుమిట్టాడారు. తాజాగా కురిసిన వర్షాలు రైతుల బెంగను పూర్తిగా తీర్చేశాయి. దీంతో ట్రాక్టర్లతో దమ్ముపట్టి, కూలీలతో నాట్లు వేయించే పనిలో బిజీ అయ్యారు. అంతా ఒకేసారి నాట్లుకు సిద్ధం కావడంతో కూలీల కొరత వేధిస్తోందని రైతులు చెప్పున్నారు.

తుమ్మపాల: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరింది. దీంతో రైతుల్లో ఆనందం హెచ్చింది. వాగులు, వంకల్లో ప్రవాహాలు పెరిగాయి. చెరువులు నిండుకుండల్లా మారాయి. దీంతో రైతులు ముమ్మరంగా దమ్ములు పట్టి, వరినాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో తొలకరిలో వేసిన వరి నారు కొన్ని చోట్ల ఎండిపోయింది. మిగిలిన ప్రాంతాల్లో రైతులు కాపాడుకుంటూ వచ్చారు. ఇటీవల వారం రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పుష్కలంగా నీరు చేరింది. దీంతో రైతులు ముమ్మరంగా వరినాట్లు వేసే పనిలోపడ్డారు.

వేధిస్తున్న కూలీల కొరత

తాజా వర్షాలతో మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉడుపులు ఒకేసారి మొదలయ్యాయి. దీంతో కూలీల కొరత ఏర్పడింది. వర్షానికి పొలాల్లో నీరు చేరినప్పటికి గత రెండు రోజులుగా ఎండలు బాగా పెరగడంతో ఉడుపులు చేసేందుకు రైతులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎండలు పెరిగే కొద్ది పంట పొలాల్లో నీరు ఆరిపోతుందన్న భయంతో అంతా ఒకసారి సిద్ధమయ్యారు. దీంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. సాధారణంగా రూ.150 నుంచి రూ.200 వరకు ఉండే రోజు కూలీ, ఇపుడు రూ.300కు పెరిగింది. అయినప్పటికీ కూలీలు దొరకట్లేదని రైతులు వాపోతున్నారు. దమ్ము పట్టేందుకు ట్రాక్టర్లున్నప్పటికీ, నాట్లు వేసేందుకే ఇబ్బంది నెలకొందని చెప్పన్నారు.

మండలంలో 7,300 ఎకరాల్లో వరి

మండలంలో 32 గ్రామ పంచాయతీలున్నాయి. కొత్తూరు మినహా అన్ని గ్రామాల్లోనూ వరి సాగు జరుగుతోంది. వరి ప్రధాన పంటగా దాదాపు 7,300 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

మండలంలో మొత్తం సాగు విస్తీర్ణం 11,750 ఎకరాలు. వరి నాట్లు గతంతో పోల్చితే ఈ ఏడాది ఆలస్యమయ్యాయి. నారు ఎండిపోతుందన్న బెంగలో ఉన్న రైతుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు ఆశలు చిగురించాయి. ఆగస్టు చివరి నాటికి కేవలం 1,600 ఎకరాల్లోనే వరినాట్లు పూర్తయ్యాయి. మిగిలిన విస్తీర్ణంలో నీటి కొరత కారణంగా వరినాట్లు చేయలేక ఆశలు వదులుకున్న రైతులకు ఇటీవల వర్షాలు ఆనందాన్నిచ్చాయి. దీంతో వరి నాట్లు వేసేందుకు రైతులు తలమునకలై ఉన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



మాట్లాడుతున్న ఒంపోలు సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ



హరిపాలెంలో నిర్వహించిన ర్యాలీ

మునగపాక: మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని ఒంపోలు సచివాలయ కన్వీనర్ నరాలశెట్టి సూర్యనారాయణ కోరారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఒంపోలు అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు సరైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల ద్వారా మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొద్దపు శ్రీరామమూర్తి, ద్వారం జానకీరామ్, సర్పంచ్ సూరిబాబు, సీహెచ్‌వో దేవకాంత, అంగన్‌వాడీ టీచర్ సత్యవతి, ఏఎన్‌ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హరిపాలెంలో ర్యాలీ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్టు, ఏషియన్ పెయింట్స్ ఆధ్వర్యంలో బుధవారం పోషకాహార మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా విజయవాహిని బ్లాక్ కో–ఆర్డినేటర్ హారిక పోషకాహార ప్రాధాన్యతను వివరించారు.బ్లాక్ మేనేజర్ సాయిచరణ్,సర్పంచ్ భర్త మారిసెట్టి సూర్యనారాయణ, ఎంపీటీసీ భర్త శరగడం ప్రసాద్,అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీనారాయణమ్మ,సావిత్రి,మౌనికా ఉషారాణి,సంతోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



హెచ్‌ఎం రామచంద్రరావును సన్మానిస్తున్న వేమగిరి గ్రామస్తులు

ఎస్.రాయవరం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వేమగిరి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం బోజంగి రామచంద్రరావును గ్రామస్తులు, ఉపాధ్యాయులు బుధవారం వేమగిరిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో రామచంద్రరావు విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతు రంగారావు,ఉపాధ్యాయులు శేషు,లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం



కోలాటం ఆడుతున్న మహిళలు

మునగపాక: స్థానిక సంతబయలు వద్ద బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. శ్రీ కృష్ణ బాలల యువజన సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఈ ప్రదర్శన నిర్వహించారు. మునగపాకకు చెందిన అన్నమయ్య స్వర తరంగిణి ఆధ్వర్యంలో జరిగిన కోలాటం ప్రదర్శనను తిలకించేందుకు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ కృష్ణుని దర్శనంకోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ కృషి



దేవవరంలో ఉపాధ్యాయులతో ఏపీటీఎఫ్ నేతలు

నక్కపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు తెలిపారు. మండలంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవవరం, ఒడ్డిమెట్ట, గొడిచర్ల,వేంపాడు ఉద్దండపురం తదితర గ్రామాల్లో ఉపాధ్యాయ సంఘం నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటపతిరాజు మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో మండలశాఖ నాయకులు కొండలరావు, దేవర నర్సింహమూర్తి, శ్రీను, అప్పలరాజు, రంగబాబు సింహాచలం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ఆప్కాబ్ ఎండీకి వినతి



సమస్యలపై ఆప్కాబ్ ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జులు

యలమంచిలి: సహకార సంఘాల సభ్య రైతులను ఆదుకోవాలని పలు పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.ఎస్.రెడ్డిని కోరారు. రైతుల సమస్యలపై యలమంచిలి నియోజక వర్గ పీఏసీఎస్ ఇన్‌చార్జిలు బుధవారం విజయవాడ ఆప్కాబ్ కార్యాలయంలో ఆయనను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్‌ల ఆర్థిక పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కొక్కిరాపల్లి, తిమ్మరాజుపేట, చూచుకొండ, మునగపాక పీఏసీఎస్‌ల పర్సన్‌ఇన్‌చార్జులు వరుసగా మళ్ల కొండబాబు, కాండ్రేగుల అప్పారావు, పెంటకోట హరేరామ్, కె.రామ్మోహనరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మూలపేటలో మట్టి సేకరణ చేస్తున్న బీజేపీ శ్రేణులు

మునగపాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు కోరారు. నాదేశం- నామట్టి కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మూలపేటలో బీజేపీ ఆధ్వర్యంలో మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రధానమంత్రి నరేంద్రమోడీ అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దొడ్డి వెంకట సత్యనారాయణ,మళ్ల కాలేశ్వరరావు,మళ్ల జోగినాయుడు, మళ్ల మల్లయ్యనాయుడు,భార్గవాచార్యపాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తుల స్వీకరణ

మాడుగుల రూరల్: రైతు భరోసా నగదు లబ్ధి పొందడానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. రైతు భరోసా కేంద్రాలల్లో విధిగారిజిస్ట్రేషను చేసుకోవాలని, పట్టాదారు పాసుపుస్తకం, 1బి, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జెరాక్స్‌లతో పాటు ఒక పాస్ ఫొటోను తీసుకొని, రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.